క్లుప్తంగా

ఓక్ ట్రీ విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణానికి చెందిన ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ తైక్వాండో 2023 పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన వి.వసంత్‌కుమార్, సుదీక్ష, ఆరాధ్యలు బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ గింజల నర్సిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం 5 నుంచి 11గంటల వరకు పెద్ద బండ, ఔట్‌డోర్ స్టేడియం, గొల్లగూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం చేనేతమిత్ర పథకాన్ని సరళీకరణ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని ఏపూరు గ్రామంలో పద్మశాలీలు, చేనేత కార్మికులు సోమవారం సీఎం కేసీఆర్, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం గ్రామ కార్యదర్శి తాటి బాలకృష్ణ, కోశాధికారి తాటి శ్యాంసుందర్, వార్డు సభ్యురాలు తాటి మానస, తాటి శంకరయ్య, తాటి బలరాం, తాటి వెంకటేశం, పున్న సతీష్, తాటి నర్సింహ, వలిగొండ రమేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నాంపల్లి : మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు ఉన్నారు.

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

మునుగోడు: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం కోరారు. సోమవారం మునుగోడులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం మండల సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, వేముల లింగస్వామి, పగడాల కాంతయ్య పాల్గొన్నారు.

మేరీ మాటీ మేరా దేశ్

నకిరేకల్ : ఢిల్లీలో అమరవీరుల స్మారక స్థూపం కోసం నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ ఆధ్వర్యంలో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రతి ఇంటినుంచి మట్టి సేకరించారు. చనగాని రాములు, సీతా ఆంజనేయులు, శ్రీకాంత్, ప్రేమ్ కుమార్, సింహం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కరపత్రాలు విడుదల

నకిరేకల్ : ఈ నెల 9న నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో నకిరేకల్, తుంగతుర్తి ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించనున్న గద్దరన్న యాది సభ ప్రచార కరపత్రాలను కాంగ్రెస్ నేత దైద రవీందర్ సోమవారం నకిరేకల్‌లో విడుదల చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు వంటెపాక ప్రసాద్, ఆవుల వేణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

నాంపల్లి : మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీలకు సంబంధించిన క్రీడా సామగ్రిని సోమవారం ఎంపీపీ శ్వేతారవీందర్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మర్రిగూడ : మునుగోడు ఉప ఎన్నికలో శివన్నగూడ భూ నిర్వాసితులకు ఎమ్మెల్యే, మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద శివన్నగూడ భూ నిర్వాసితులు, చర్లగూడ ముంపు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శివన్నగూడ భూ నిర్వాసిత పోరాట సమితి అధ్యక్షుడు వల్లపు కేశవులుగౌడ్, నాగిళ్ల మారయ్య, సంకబుడ్డి మల్లేష్, శంకరయ్య, శ్రీను, యాదయ్య, రాములు, శ్రీను, యాదగిరిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం

నల్లగొండ టౌన్ : పీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని 500 మంది రోగుల కుటుంబ సభ్యులకు అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ జాగటి పృథ్వీరాజ్, రాజు, రిజ్వాన్, ఇమ్రాన్, మామిడి కార్తీక్ , తిరుమలేష్, మట్టుపల్లి సాయి విజయ్ , చందర్, కిషన్, సునీల్, నాంపల్లి శివ, రాజేష్, హరీష్, పరమేష్, ధనుష్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : నిరుపేద దళితులకు గృహ అవసరాలకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రమాదం అంచున ప్రయాణం!

- దెబ్బతిన్న కల్వర్టులు
- పైనుంచే పారుతున్న వర్షపు నీరు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు



శివన్నగూడ - ఇందుర్తి గ్రామాల మధ్య కల్వర్టు పైనుంచి పారుతున్న నీరు

మర్రిగూడ : బీటీ రోడ్లు దెబ్బతినకుండా వర్షపు నీరు సాఫీగా ప్రవహించేందుకు మండలంలోని పలు ప్రదేశాల్లో పాతికేళ్ల క్రితం కల్వర్టులు నిర్మించారు. దిగువ భాగంలో కొన్నిచోట్ల రాతి కట్టడాలతో కల్వర్టులను నిర్మించారు. ప్రస్తుతం అవి దెబ్బతిని వర్షం వచ్చిన సమయంలో కల్వర్టుల పైనుంచి వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రయాణం ప్రాణసంకటం..

మర్రిగూడ మండల పరిధిలోని మేటిచందాపురం, కొట్టాల, నామాపురం గ్రామాల మధ్యలో కల్వర్టుల పైనుంచి ప్రయాణించాలంటే వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. నిత్యం గుంతలమయంగా ఉన్న రోడ్లు, కల్వర్టుల పైనుంచి శివన్నగూడకు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నామాపురం నుంచి కొట్టాల, ఇందుర్తి మీదుగా శివన్నగూడ వరకు 7కి.మీ మేర రోడ్డు మరమ్మతులు చేపట్టి కల్వర్టును సరిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇందుర్తికి వెళ్లే దారిలో..

శివన్నగూడ నుంచి ఇందుర్తి, నామాపురం గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టు దిగువ భాగంలో గూనలు ఏర్పాటు చేయకపోవడంతో కల్వర్టు కింది భాగం పూర్తిగా దెబ్బతింది. పెద్ద వాహనం వచ్చినప్పుడు ఈ కల్వర్టు ఎప్పుడు కుంగిపోతుందోనని ఇరు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం నీరు ప్రవహిస్తుండడంతో కల్వర్టుపై నాచు పేరుకుపోయి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు.

నిత్యం ప్రమాదాలు..

కల్వర్టుపై నాచు పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు దాదాపు 30 నుంచి 40 మందికి పైగా ప్రమాదానికి గురయ్యారు. నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి ప్రమాదానికి గురి కావడంతో కాలు విరిగింది. కొట్టాల పాఠశాల ఉపాధ్యాయులు ఈ కల్వర్టు వద్ద కింద పడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. నామాపురం పాఠశాల ఉపాధ్యాయులు కిందపడి స్వల్ప గాయాలపాలై కోలుకుతున్నారు. ఇందుర్తి, శివన్నగూడ గ్రామాలకు చెందిన అనేకమంది ఈ కల్వర్టుపై ప్రమాదానికి గురైన వారే. కొన్ని సందర్భాల్లో ఇందుర్తి గ్రామస్తులు శివన్నగూడకు చేరుకోవాలంటే ప్రమాదం జరుగుతుందేమోనని భయపడి సరంపేట మీదుగా వస్తున్నారు. శివన్నగూడ గ్రామస్తులు నల్లగొండకు చేరుకోవాలంటే శివన్నగూడ-ఇందుర్తి గ్రామాల కల్వర్టును దాటాల్సిందే. ఇటీవల శివన్నగూడ-అంతంపేట గ్రామాల మధ్య గూనలు ఏర్పాటు చేశారు. శివన్నగూడ-నామాపురం గ్రామాల మధ్య గల రోడ్డు సమస్యను, శివన్నగూడ-ఇందుర్తి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు పూర్తి చేయాలి



శివన్నగూడ నుంచి నామాపురం వరకు గల 7కి.మీ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సకాలంలో గమ్యానికి చేరుకోలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులను సకాలంలో పూర్తి చేసి ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా కాపాడాలి.

– గంట కవిత, కొట్టాల సర్పంచ్

ప్రమాదాలు జరుగుతున్నాయి



శివన్నగూడ నుంచి ఇందుర్తి వరకు ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారి కల్వర్టు వద్ద అనేక మంది ప్రమాదాలకు గురై గాయపడ్డారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం బాధాకరం.

– ఎండీ. యాసిన్, ఇందుర్తి

టెండర్ పూర్తయింది

గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి నుంచి శివన్నగూడ వరకు రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తయింది. శివన్నగూడ-ఇందుర్తి గ్రామాల మధ్య ప్రధాన కల్వర్టుకు సీసీ మంజూరైంది. నామాపురం వరకు రోడ్డు పూర్తి చేశాం. నామాపురం నుంచి శివన్నగూడ వరకు అధికంగా గుంతలు ఉండడం వల్ల వాటిని పూడ్చి రోడ్డు పనులు పూర్తి చేస్తాం. 6 కి.మీ మేర రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

– యశ్వంత్, పీఆర్ ఏఈ

సమస్యల పరిష్కారానికి కృషి



నల్లగొండ టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టౌన్ : ఆశ కార్యకర్తల సమస్యలను మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. ఆశ కార్యకర్తల జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం నల్లగొండ పట్టణంలోని టీఎన్జీఓ భవన్‌లో అధ్యక్షురాలు కే శైలజ, జిల్లా కార్యదర్శి సైదమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆశ కార్యకర్తల జీతాలను పెంచే విధంగా ప్రయత్నిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి కొండలరావు, టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఎం శ్రవణ్ కుమార్, జిల్లా కార్యదర్శి కంచనపల్లి కిరణ్ కుమార్, కోశాధికారి మేడి జయరావు, జిల్లా ఉపాధ్యక్షులు జె శేఖర్‌రెడ్డి, ఆశ కోఆర్డినేటర్ వెంకట్ రెడ్డి, కొండమల్లేపల్లి అధ్యక్షుడు కత్తుల మనోజ్ ప్రదీప్, పశుసంవర్ధక శాఖ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు ధీరావత్ సైదులునాయక్, వీరభద్రమ్మ హేమలత దేవిక భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

కనగల్ : లింగాలగూడెం గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదయ్యగౌడ్, సర్పంచ్ యంపల్ల ధనమ్మసైదులతో కలిసి డీఈ నాగయ్య సోమవారం ప్రారంభించారు. కార్యదర్శి చనగాని శతి, యాదవ సంఘం మండలాధ్యక్షుడు శ్యాంసుదర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

మునుగోడు : పోషణ మాసంలో భాగంగా సోమవారం కొరటికల్ సెక్టార్ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు మాధురి, నర్మద వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మహిళలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, కొరటికల్ సెక్టార్ అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలి



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

మర్రిగూడ : ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన ఉండాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీమడివాల మాసిదేవుడు సీతాలమ్మఈదమ్మ ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక బస్టాండ్ నుంచి నిర్మించే సీసీ రోడ్డును సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, సర్పంచ్ నల్ల యాదయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పగడాల అంజయ్య, సిలివేరు పెద్దయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, కొలుకులపల్లి యాదయ్య, ఆలయ అర్చకులు లోక వెంకటశర్మ, లోక సాయినాథ్‌శర్మ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి



చిట్యాల : అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం కేసీఆర్‌కు మద్దతివ్వడంతోపాటు రాబోయే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. చిట్యాల మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డులో డ్రెయినేజీపై ఐదు లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేయనున్న స్లాబ్ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీలోని రెండు, తొమ్మిదో వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన సైదులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి జిట్ట చంద్రకాంత్ పాల్గొన్నారు.

భూమి పూజ

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామ శివారులోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య భూమి పూజ చేశారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నేత దైద రవీందర్ వేర్వేరుగా భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థల దాత ముచ్చపోతుల జానయ్య, సంఘ ప్రతినిధి బంటు రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వేముల వీరేశం భరోసా

చిట్యాల : పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కుక్కల మోహన్ తమ్ముడు కిరణ్ పదిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. మృతుడి ముగ్గురు పిల్లల చదువులకు ప్రతియేటా ఫీజులు చెల్లించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం వెంబాయి గ్రామంలో బలవన్మరణానికి పాల్పడిన ఓర్సు శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, తాళ్ళవెల్లెంల, వెంబావి సర్పంచ్‌లు జనగాం రవీందర్ గౌడ్, అద్దెల నర్సిరెడ్డి, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, అద్దెల లింగారెడ్డి, బట్టు అయిలేష్, జిట్ట భిక్షం, అశోక్, రాజేష్, చిత్రగంటి శ్రీను, అక్రం ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్

శాలిగౌరారం : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పలంచ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 25 మంది బీఆర్‌ఎస్ మండల నాయకుడు గంట శంకర్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు రమేశ్, రుద్రారం మల్లయ్య, మారోజు ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగిరి (నల్లగొండ) : తిప్పర్తి మండలంలో పలువురు బాధిత కుటుంబాలకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. తిప్పర్తికి చెందిన నేహా తబస్సుమ్ వివాహ ఖర్చులకు రూ. 20 వేలు, సిలార్‌మియాగూడెంకు చెందిన పోకల జానయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆయన భార్య జానకమ్మకు రూ. 50 వేలను ఎంపీ కోమటిరెడ్డి పంపగా సోమవారం స్థానిక నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, యూత్ అధ్యక్షుడు బద్దం సుధీర్, గుమ్మల మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై నల్లగొండలోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధి పావురాలగూడెంకు చెందిన కడారి సందీప్ కుటుంబానికి పావురాలగూడెంకు చెందిన లోకమాన్య యూత్ ఆధ్వర్యంలో సోమవారం రూ.55 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : నకిరేకల్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ కుటుంబాలవారికి రూ.70 వేల ఆర్థిక సహాయాన్నిటీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అందజేశారు. పాలెంకు చెందిన ఆవుల వేణుకు రూ.50 వేలు, మృతి చెందిన మహబూబ్ అలీ కుమారుడు నసీర్ చదువు కోసం రూ.10 వేలు, మాజీద్ కుమారుడు రహ్మాన్‌కు రూ.10 వేలు అందజేశారు.

పార్టీకి పనిచేసిన వారికే మొదటి అవకాశం ఇవ్వాలి



చండూరులో మాట్లాడుతున్న స్రవంతి రెడ్డి

చండూరు : పార్టీకి విధేయులుగా ఉంటూ పార్టీ కోసం పనిచేసిన వ్యక్తులకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని టీ పీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతిరెడ్డి అన్నారు. సోమవారం చండూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిష్టానం మొదటి నుంచి కష్టపడిన వారిని కచ్చితంగా గుర్తిస్తుందని, పార్టీలో గెలిచి వేరే పార్టీకి వెళ్లేవారికి అవకాశం ఇవ్వొద్దని కోరారు. టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత మాట్లాడుతూ తమతో చర్చించకుండా అధిష్టానం పొత్తుల విషయమై ఎట్టి పరిస్థితుల్లో ముందుకు వెళ్లదని అన్నారు. రాపోలు జయప్రకాశ్, మంచుకొండ సంజయ్, పన్నాల లింగయ్య, గుండూరి నర్సింహ, నేర్లకంటి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్‌కు దరఖాస్తు

చిట్యాల : నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ నుంచి అవకాశం కల్పించాలని కోరుతూ చిట్యాల పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్ హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల అధ్యక్షులు కూరెళ్ళ శ్రీను, పల్స శ్రీను, నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షులు యానాల శ్రీనువాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాచకొండ గిరి

నల్లగొండ టూటౌన్ : స్వర్ణకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ రాష్ట్రంలో స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దీక్ష వద్దకు చేరుకుని స్వర్ణకారుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి మహేశ్వరం వెంకటాచారి, చంద్రశేఖర్, బ్రహ్మచారి, కొండయ్య, హరిప్రసాద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే దీక్ష

నల్లగొండ : రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు పట్టణంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భిక్షంగౌడ్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, డిమాండ్ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిట్యాల: డీసీసీబీ ద్వారా ఖాతాదారులకు, రైతులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల డీసీసీబీ మేనేజర్ కర్నాటి అశోక్ కోరారు. ఉరుమడ్ల గ్రామంలో డీసీసీబీ, నాబార్డు సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ ద్వారా రైతులకు అతి తక్కువకు గోల్డ్ లోన్, విద్యా రుణాలు, వ్యవసాయ వాహనాల కొనుగోలు, కోళ్ల పెంపకానికి రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. పీఏసీఎస్ సెక్రటరి బ్రహ్మచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వరుడు, నవ గ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ముత్తినేని శ్యాంసుందర్ ఆధ్వర్యంలో వేద పండితులు గణపతిపూజ, పుణ్యావచనం, యంత్రస్థాపన పూజలు నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రామడుగు రామకృష్ణ శర్మ, వేద పండితులు కొండగడప హరిప్రసాదశర్మ, సాకేత్ శర్మ, చంద్రమౌళి శర్మ, శ్రీనివాస్‌శర్మ, ఎంపీటీసీ ముత్తినేని అనూషనాగేశ్వరరావు, వనపర్తి అంజయ్య, జూకూరి రమేష్, ఆలయ చైర్మన్ వనపర్తి కొండయ్య, సైదులు, శేఖర్, కోటయ్య, వెంకన్న, శ్రీనివాస్, నాగయ్య, పెద్ద సైదులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నల్లగొండ టూటౌన్ : పెద్దవూర మండలంలోని తుంగతుర్తి గ్రామపంచాయతీ పరిధి రామన్నగూడెం తండాకు చెందిన కొందరు తుంగతుర్తి, చలకుర్తి, పర్వేదుల గ్రామాల రెవెన్యూ శివారుల్లో నకిలీ పట్టాలు సృష్టించి అసలైన పట్టాదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రామన్నగూడెం తండావాసులు సోమవారం కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. రమావత్ బాసు, నాగేశ్వర్‌రావు, రవి, రాంబాబు దొంగ పట్టాలు సృష్టించి 50 ఎకరాలు కబ్జా చేశారని తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో ఆర్ శంకర్ నాయక్, గోడియా నాయక్, లాలు, స్వామి, క్రాంతికుమార్, ప్రసాద్, రఘు, చంద్రకళ, కిషన్ ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

నల్లగొండ రూరల్ : తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం నల్లగొండ తహసీల్దార్ శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దండెపల్లి సత్తయ్య గౌడ్, విజయలక్ష్మి, లక్ష్మి, ప్రకృతాంబ పాల్గొన్నారు.

ఆలయం వద్ద భక్తుల సందడి

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సోమవారం భక్తుల కోలహలం నెలకొంది. ఆలయంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల సతీమణి రమాదేవి కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనం తీసుకువచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

మునుగోడు: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కందుల సూర్యప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం చలమల్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి ఆయా పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వస్తున్నారని అన్నారు. పార్టీలో చేరినవారిలో బీజేపీ జిల్లా నాయకుడు గుర్జ కృష్ణతో పాటు పలువురు యువకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఏపూరి యాదయ్య, పెద్దులు, గుండు చెన్నకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనం ఇవ్వాలి

నల్లగొండ రూరల్ : పెంచిన వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అనురాధ, లక్ష్మమ్మ, రాములమ్మ, లింగమ్మ, నాగమ్మ, శంకరమ్మ, కళమ్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు నెలకు రూ.3వేల వేతనం అందించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎన్.నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, నీరుడు రాజ్యలక్ష్మి, దమయంతి, సత్తెమ్మ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సాగర్ల మల్లేష్ పాల్గొన్నారు.

చిట్యాల: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పెరిగిన వేతనాన్ని చెల్లించాలని, కోడిగుడ్ల కొనుగోలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ చిట్యాల తహసీల్దార్ దశరథకు సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వినతి పత్రం అందజేశారు. ఆవుల అనసూర్య, నోముల విజయ, పంతంగి యాదమ్మ, కొంపెల్లి అండాలు, మేడి జ్యోతి, శ్యామల, జయమ్మ, గంగమ్మ, మణెమ్మ, అనూష పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న వైద్యులు

నల్లగొండ టౌన్ : పట్టణంలో శాంతినగర్‌కు చెందిన కట్ట శివసాయిభవాణి కుటుంబానికి న్యాయం చేయాలంటూ కోరుతూ కుటుంబ సభ్యులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిభవాణి తండ్రి వెంకటేశం మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని విఠల్ ఆస్పత్రి డాక్టర్ బాధ్యతారహితంగా వైద్యం చేయడం వల్ల తన కూతురు శివసాయిభవాణి మరణించిందని పేర్కొన్నారు. సీరియస్ కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పంపించారని, అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 14న తన కూతురు మరణించిందని తెలిపారు. తన కూతురు మరణానికి కారణమైన డాక్టర్ విఠల్ బాబును తక్షణమే అరెస్టు చేసి ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.డీఎంహెచ్‌ఓ కొండల్‌రావుపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు అంతటి సమాధానం, జ్యోతి, విజయరాణి, రమణి, దుర్గమ్మ, రామస్వామి, మహేష్, దేవేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

శివసాయి భవాణి మృతికి తన నిర్లక్ష్యమే కారణమంటూ ఆమె బంధువులు తమపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని డాక్టర్ విఠల్ అన్నారు. సోమవారం స్థానిక ఐఎంఏ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎంఏ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సాయి భవాణి తన ఆస్పత్రిలో కేవలం 24గంటలు మాత్రమే చికిత్స పొందిందన్నారు. 5 రోజులు మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొంది వివిధ కారణాల వల్ల మరణించిందని యశోద ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు సుచరిత, గౌరిశ్రీ, అనితరాణి, సుబ్బారావు, రాజేశ్వరి, లీలావతి, పుల్లారావు, శశాంక్, కిరణ్, వెంకటకృష్ణలు పాల్గొన్నారు.